నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతుల కారణంగా మండలంలోని అర్బన్, రూరల్ సబ్ స్టేషన్ల పరిధిలో ఈనెల 23న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈలు రాంబాబు, మౌలాలి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్వెల్లి, నూతన్‌కల్, ఎస్‌పీఐసీ, తండా, సోమారం, గుబ్బా, పీహెచ్ఐ, ఎల్లంపేట్, అత్వెల్లి, సుమో బిస్కెట్స్, టైం టెక్నో, కిష్టాపూర్, గోసియిగూడ, ఐడీఏ హనుమాన్, వెల్‌సెట్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు రండి



పట్నం మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ నారాయణ

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 24 నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి పట్నం.మహేందర్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కెల్లార్, మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్‌కు, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ ఆధ్వర్యంలో శనివారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో ఈట సుధాకర్‌రెడ్డి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం



కీసరగుట్టలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం

కీసర: కీసరగుట్ట బ్రహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే షాపుల నుంచి ఫీజు వసూలు చేసేందుకు కీసరవాణి వద్ద దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో శనివారం తైబజార్ వేలం నిర్వహించారు. ఎస్.కృష్ణారావు రూ. 4 లక్షలకు దక్కించుకున్నాడు. 6 రోజుల పాటు కీసరగుట్ట జాతరలో దుకాణసముదాయాల నుంచి తైబజార్ రుసుం చెల్లించేందుకు అవకాశం కల్పించాలమని కమిషనర్ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఘట్‌కేసర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదకు ఎన్‌ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. నల్గొండ జిల్లా దేవరకొండ డివిజన్ చామాదంపేట మండలం, కంబాలపల్లికి చెందిన అంధురాలు పున్నమ్మకు గర్భసంచిలో గడ్డ ఏర్పడగా చికిత్స కోసం ఆస్పత్రిలో చేరింది. ఆమెకు అంధుడైన కుమారుడు కూడా ఉన్నాడు. పేద కుటుంబం కావడంతో ఆదుకోవాలని బాధితురాలి విన్నపం మేరకు ఎన్‌ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు రూ. 20 వేలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అరుణకుమారి, సుందర్‌రావు, శ్రీకాంత్, వీరారెడ్డి, ఎల్లప్ప, రామయ్య, కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

ఘట్‌కేసర్: గడ్డివాము దగ్ధమైన ఘటన ఎదులాబాద్‌లో శనివారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఎదులాబాద్‌కు చెందిన బింగి వెంకటేశ్‌గౌడ్, జెనిగె లింగం యాదవ్ పాతకోటలో రెండు గడ్డివాములు పెట్టాడు. శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

లాభాల పేరిట మోసం

పోచారం: లాభాల పేరిట విద్యార్థినిని మోసం చేసిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన ప్రకారం.. వెంకటాపూర్‌లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థి సదాశివ సంజీవ్ (21) టెలీగ్రాం గ్రూప్‌లో చేరాడు. దాంట్లో పెట్టుబడికి సంబంధించిన లింక్ చూశాడు. డబ్బు పెట్టుబడిగా పెడితే లాభాలు వస్తాయని నమ్మి విడతల వారీగా మొత్తం రూ. 64 వేలు చెల్లించాడు. తనకు తిరిగి డబ్బు రాకపోవడంతో మోసపోయానని గ్రహించి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల్లో సమస్యల తిష్ట!

- అధిక శాతం అద్దె భవనాల్లోనే నిర్వహణ
- మరోవైపు టీచర్లు, హెల్పర్లకు అందని వేతనాలు
- కూరగాయలు, గ్యాస్ బిల్లులు కూడా రానీ వైనం
- పిల్లలు, గర్భిణులకు తప్పని ఇక్కట్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఓవైపు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు లేక అల్లాడుతుంటే, మరోవైపు అధిక శాతం సెంటర్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇంకోవైపు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలకు నెలనెలా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికితోడు కూరగాయలు, గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా ఏడాదిగా పెండింగ్‌లో ఉండడంతో అప్పులు తెచ్చి కేంద్రాలను నిర్వహించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 212 సెంటర్లకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. ఇవిగాకుండా దాతలు ఇచ్చిన మరో 138 భవనాల్లో కొన్ని కొనసాగుతుండగా, మిగిలిన 443 కేంద్రాలు మాత్రం అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా, అత్యధికంగా 277 సెంటర్లు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. అల్వాల్‌లో 271 కేంద్రాలకు 143 కేంద్రాలు, మేడ్చల్‌లో 211 కేంద్రాలకు 23 సెంటర్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి 6 నెలలుగా అద్దె డబ్బులు చెల్లించకపోవడంతో యాజమానుల నుంచి ఒత్తిడి భరించలేకపోతున్నామని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

117 కేంద్రాల్లో నీటి కట..కట

◆ జిల్లాలోని 117 కేంద్రాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో అత్యధికంగా 77 కేంద్రాలు, అల్వాల్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

మరుగుదొడ్లు అంతంతే..

◆ జిల్లాలోని 118 అంగన్‌వాడీ కేంద్రాలోలే కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. ఇందులో మేడ్చల్ పరిధిలో 78, అల్వాల్ పరిధిలో 51, కుత్బుల్లాపూర్ పరిధిలో 40 కేంద్రాలు ఉన్నాయి.

793 కేంద్రాల్లో 1.07 లక్షల లబ్ధిదారులు

జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇందులో 6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు 90,361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది మొత్తం 1,07,484 మంది ఉన్నారు. ఇందులో కుత్బుల్లాపూర్ పరిధిలోని 311 కేంద్రాల్లో 47,028 మంది, మేడ్చల్‌లోని 211 కేంద్రాల్లో 39,463 మంది, అల్వాల్ పరిధిలో 271 కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక ప్రణాళిక



శామీర్‌పేటలో మార్నింగ్ వాక్ నిర్వహిస్తున్న కమిషనర్

శామీర్‌పేట్: వేసవిలో నీటి ఎద్దడి లేకుడా ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తున్నామని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. తుంకుంట మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన శామీర్‌పేట, బాబాగూడ, బొమ్మరాశిపేటలో శనివారం ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీల్లో తిరుగుతూ నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకున్నారు. వివరాల వేసవిలో ముందస్తు చర్యల్లో భాగంగా డిమాండ్ సరిపడా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే నీటి కొరత సమస్యలపై మున్సిపాలిటీ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈ సునీత, మాజీ సర్పంచ్ కిశోర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేందర్‌యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

మేడ్చల్: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరి మండలంలోని శ్రీరంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. సేవలు, హాజరు, ఇతర రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం అవుట్ పేషెంట్, ఇమ్యూనైజేషన్ యాంటీ నాటల్ కేర్ వంటి వాటిపై సమీక్షించారు. పీహెచ్‌సీ ఆవరణను శుభ్రంగా ఉంచాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆమె వెంట వైద్యులు ప్రతిభ, ఉషారాణి, గీత, బుజ్జి, సుదర్శన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పశువులు తరలిస్తున్న పలువురిపై కేసు

ఘట్‌కేసర్: పశువులు తరలిస్తున్న ఇరువురిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నేరెడ్‌మెట్‌కు చెందిన దావుత్ పాషా (30), నరేశ్ (29) భువనగిరి వైపు నుంచి నగరంలోని కబేళాలకు ఓ వ్యాన్‌లో 20 పశువులను తరలిస్తున్నారు. శనివారం ఉదయం పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో తనిఖీలు చేపట్టారు. పశువులకు నీరు, ఆహారం పెట్టకుండా హింసిస్తూ తరలిస్తున్నారని ఇరువురిపై కేసు నమోదు చేశారు.



వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు

ఎస్‌కేఎం పాఠశాలలో సైన్స్‌ఫేర్



ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్‌లోని ఎస్‌కేఎం పాఠశాలలో శనివారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టెక్నాలజీకి అనుగుణంగా పలు ప్రదర్శనలు ఇచ్చారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్‌లు తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శృతిగౌడ్, కరస్పాండెంట్ లవకుమార్‌గౌడ్, హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు గోపాల్, విక్రమ్, ఇమ్రాన్, మాజీ సర్పంచ్‌లు చిట్టిమిల్ల గణేశ్, శ్రీనాథ్‌రెడ్డి, గణేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సెయింట్ ఆండ్రూస్ స్కూల్‌లో క్రికెట్ శిక్షణ

కీసర: క్రిమన్స్ స్పోర్ట్స్ అకాడమీ, క్రికిండ్‌డమ్ సంయుక్తంగా ఈనెల 22,23న దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలో గల సెయింట్ ఆండ్రూస్ స్కూల్, నగరంలోని సుచిత్రలోగల సెయింట్ మైఖేల్ స్కూల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులోభాగంగా శనివారం లెజెండరీ క్రికెటర్, ప్రముఖ అంతర్జాతీయ కోచ్ డేవ్‌వాట్‌మోర్ పాల్గొని యువ క్రికెటర్లకు బ్యాటింగ్, బౌలింగ్ పద్ధతులను నేర్పించారు. అలాగే ఆటలో మెరుగయ్యేందుకు అవసరమైన సాంకేతిక, ప్రాక్టీకల్ సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా క్రిమన్స్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మాట్లాడుతూ.. తమ అకాడమీ ద్వారా ప్రపంచస్థాయి శిక్షణ అందిస్తున్నామన్నారు. సుమారు 350 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అంతర్జాతీయ క్రికెట్ కోచ్ డేవ్‌వాట్‌మోర్

బైక్ అదుపుతప్పి ప్రభుత్వ ఉద్యోగి మృతి



నక్క సందీప్ (ఫైల్)

మేడిపల్లి: ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన నక్క సందీప్ (32) మేడిపల్లి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ పీర్జాదిగూడలో నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై నిత్యావసర సరుకుల కోసం వెళ్తున్నాడు. స్థానికంగా ఉన్న రిలయన్స్ సూపర్ మార్కెట్ సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న షట్టర్‌కు బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో ట్రైనీ మృతి



రమేశ్‌బాబు (ఫైల్)

మల్కాజిగిరి: అనారోగ్యంతో రైల్వే ట్రైనీ మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గణేశ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్‌కు చెందిన రమేశ్‌బాబు (40) మౌలాలిలోని రైల్వే ట్రెనింగ్ సెంటర్‌లో ట్రెనింగ్ కోసం 14 రోజుల క్రితం వచ్చాడు. ఈనెల 22న మధ్యాహ్నం కస్తూరిబానగర్ వద్ద పడి ఉన్నాడు. గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకోగా పోలీసుల సహాయంతో ప్రిన్సిపాల్ ప్రతనేష్ కాకడే లాలాగూడలోని రైల్వే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య



సంజన(ఫైల్)

ఉప్పల్: కడుపునొప్పి భరించలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని నిక్కొండ ప్రాంతానికి చెందిన నీలా చిలుకానగర్‌లో నివాసముంటూ హోటల్‌లో పని చేస్తూ జీవనోపాధి పొందుతోంది. నీలా కుమార్తె బట్టు సంజన (15) స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. కడుపునొప్పి తీవ్రంగా ఉండడంతో శనివారం స్కూల్‌కు వెళ్లేలేదు. తల్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చి చూడగా గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయక పోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

గౌతంనగర్: గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారులతో గౌతంనగర్ ఆర్‌యూబీ నిర్మాణంపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ నుంచి టెక్నికల్ ఇష్యూ లెటర్‌ను రైల్వేకు జారీ చేయాలని అధికారులకు సూచించారు. గౌతంనగర్ చౌరస్తా నుంచి సాయినగర్ చౌరస్తా వరకు ప్రజలకు సంబంధించిన ఎలాంటి ప్రాపర్టీ డ్యామేజ్ కాకుండా నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ ఈఈ రోహిణి, రేణుక, డీఈ సుదర్శన్, ఏఈ ప్రశాంత్, బీఆర్‌ఎస్ నాయకులు రావుల అంజయ్య, మేకల రాముయాదవ్, అమీనుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, వంశీ ముదిరాజ్, సుమన్‌గౌడ్, భాగ్య నందరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో సమగ్ర కుల గణనపై సమావేశం



నాగారం సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి



జవహర్‌నగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న బాలలక్ష్మి

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయాల్లో రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి శనివారం ఎన్యూమరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంతకుమందు చేపట్టిన కులగణన సర్వేలో మిగిలిపోయిన కుటుంబాల వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఈనెల 28 వరకు పార్టీలకతీతంగా రాజకీయ పార్టీలు, కుల సంఘాలు పాల్గొని సర్వేపూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. అనంతరం నాగారం మున్సిపాలిటీలోని వెంకట్‌రెడ్డినగర్‌కాలనీలో సర్వేలో వివరాలు ఇచ్చేందుకు నిరాకరించిన ఇంటికి వెళ్లి వారి అనుమానాలు తొలగింపజేసి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, మేడ్చల్ డీబీసీడబ్ల్యూఓ, మాజీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, మాజీ కౌన్సిలర్ గోగుల సరితావెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నేతలు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సురేశ్, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కులగణన పూర్తిస్థాయిలో చేపట్టాలి

జవహర్‌నగర్: కులగణన సర్వేని అసంపూర్తిగా కాకుండా పూర్తిస్థాయిలో నిర్వహించాలని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి సూచించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో అధికారులతో కలిసి సర్వే తీరును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్లకు తాళం ఉంటే స్వయంగా అధికారులే పరిశీలించి వారి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధికారి ఝాన్సీరాణి, కమిషనర్ వసంత, మేనేజర్ నగేశ్‌బాబు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మ్యూజియం పునఃరుద్ధరణకు చర్యలు

కీసర: కీసరగుట్టలోని ఆర్కియాలజీ మ్యూజియం పునఃరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాదేవి అన్నారు. కీసరగుట్టలోని పురాతన కట్టడాలతో పాటు, ఆర్కియాలజీ మ్యూజియాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇక్కడ జరిపిన తవ్వకాల్లో లభించిన పురాతన ఆధారాల ప్రకారం గుట్టకు ఎంతో చరిత్ర ఉందన్నారు. భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రదర్శనశాలను పునఃరుద్ధరించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. ఆమె వెంట రాజు, చిక్కుడు రమేశ్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.



పురాతన కట్టడాన్ని పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గంగాదేవి

ఎమ్మార్‌సీఈలో 'విశిష్ట-2కే25'



కార్యక్రమంలో జేఎన్‌టీయూహెచ్ డైరెక్టర్, ప్రిన్సిపాల్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడ ఎమ్మార్‌సీఈ కళాశాలలో విశిష్ట-2 కే 25 పేరిట టెక్నో-కల్చరల్ ఫెస్ట్‌ను శనివారం నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్, ప్రిన్సిపాల్ అశోక్ హాజరై మాట్లాడుతూ..విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు, నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ నర్సింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కీసర: వికారాబాద్ జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల్లో మేడ్చల్ జిల్లా నుంచి జెడ్పీహెచ్‌ఎస్ యాద్గార్‌పల్లి విద్యార్థులు పుట్ట కృష్ణశ్రీ , కందుల సాయిచరణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పుష్పకళ తెలిపారు. ఈమేరకు విద్యార్థులను ఆమెతో పాటు ఉపాధ్యాయ బృందం, పీఈటీ తిరుమల్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా సత్తాచాటాలని ఆకాంక్షించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి



ఇడ్లీలు తింటున్న విద్యార్థులు

ఘట్‌కేసర్: పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలని సెయింట్ పాల్స్ హైస్కూల్ డైరెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. అవుషాపూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో «కామన్ బ్రేక్ ఫాస్ట్ ఇడ్లీ» కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యానికి మేలు చేసే ఇడ్లీలు అల్పాహారంగా ఇవ్వాలన్నారు. పిల్లలకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతోనే కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, శ్రవణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల లలితా కళల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందని విద్యార్థులు ఉదయం 9.30 గంటల వరకే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.అలాగు ఇబ్రహీంపట్నం గురుకుల పాఠశాలలో 5-9వ తరగతుల్లో చేరేందుకు అంకుసాపూర్‌లోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం కళాశాలలో నిర్వహించనున్న పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని ప్రిన్సిపాల్ రాధిక కోరారు.

క్రీడాపోటీల్లో పేర్ల నమోదుకు నేడే ఆఖరు

కీసర: కీసరగుట్ట బ్రహోత్సవాల సందర్భంగా ఈనెల 24 నుంచి కీసరగుట్టలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొనే పాఠశాలల జట్లు ఈనెల 23న ఉదయం 10 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కిష్టయ్య శనివారం తెలిపారు. 10 గంటల తర్వాత కీసర ఎంఈవో కార్యాలయంలో డ్రా తీస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9441812050 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ గోపాలరావ్, జాతర స్పోర్ట్స్ కమిటీ మెంబర్ జి. రమేశ్‌రెడ్డి, ప్రభాకర్, సత్తిరెడ్డి, వినోద్, ఆనంద్, శివరామ్, తిరుమల్‌రెడ్డి, శ్రీరాములు, టి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎన్‌ఆర్‌జీలో ఘనంగా స్పోర్ట్స్ బజ్-2025

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి విద్యాసంస్థల్లో (ఎన్‌ఎన్‌ఆర్‌జీ) స్పోర్ట్స్ బజ్-2025 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌ఎన్‌ఆర్‌జీ వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. శరీరా దారుఢ్యానికి క్రీడలో ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

శామీర్‌పేట ఆలయ నూతన కమిటీ ఎన్నిక

శామీర్‌పేట్: శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మ్యాకల మహేందర్‌యాదవ్, వైస్ చైర్మన్లుగా వల్లపు ఎల్లం, ఇర్రి వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా బోయిని రాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తిని రాంచందర్ గౌడ్, కమిటీ సభ్యులుగా దొంతరబోయిన మహేశ్, నీరుడి మధు, శేఖర్, మచేందర్, శ్రీకాంత్, వెంకటేశ్ చారి, వెంకటేశ్, సాయి, శ్రీరాములు, పరమేశ్, చిన్న, రమేశ్ ఎన్నికయ్యారు.

లైంగిక దాడి కేసు నిందితుడి రిమాండ్

మేడ్చల్‌రూరల్: మైనర్‌పై లైంగిక దాడి చేసిన నిందితుడిని మేడ్చల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని డబిల్‌పూర్ గ్రామానికి చెందిన అఖిలేష్ (21) బహదూర్‌పల్లికి చెందిన బాలిక (17) కొంపల్లిలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. బాలికను ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాధితురాలి కుటుంబ సభ్యులు శనివారం మేడ్చల్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.